# 'ప్రతివర్తన'

ఓ. శ్రీనివాసరావు



ఆరోజు ఆదివారం కావడంతో తీరిగ్గా కూర్చున్నాను. దానికితోడు ఇంట్లో ఫామిలీ కూడా లేదు. అప్పుడే వచ్చిన పేపరు తిరగేస్తుండగా, నాల్గు పదులు దాటిన ఓ వ్యక్తి మా ఎదురింటి అమ్మాయి అరుణని ఏదో అడుగుతున్నాడు. ఆ అమ్మాయి మా ఇంటివైపు చూపిస్తూ, ''అంకుల్.. మీకోసం ఎవరో వచ్చారు'' అంది.

వచ్చిన వ్యక్తి ఎవరా అని చూసి, అంతలోనే గుర్తుపట్టాను. వాడు నేను కాలేజీ చదువుతున్న రోజుల్లో నా స్నేహితుడు సుందరం.

''ఏరేయ్ సత్యం.. నన్ను గుర్తుపట్టావా?'' అన్న సుందరాన్ని ఇంట్లోకి ఆహ్వానించాను.

''ఇప్పుడెక్కడ?'' అన్నాను.

''రాజమండ్రిలో జె.ఇ.గా చేస్తున్నాను. ఇప్పుడు ఇక్కడికి బదిలీ అయ్యింది. కొద్దిరోజుల్లో మంచి ఇల్లు చూసుకొని ఫ్యామిలీని షిఫ్ట్ చేస్తాను'' అన్నాడు.

కాసేపు బాతాఖానీ అయిన తరువాత ఎవరో వస్తున్నట్లనిపించి చూసాను. ఎదురింటి అరుణ రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్షమయ్యింది.

''ఏంటమ్మా! ఇవన్నీ'' అన్నాను.

''ఏం ఫర్వాలేదంకుల్. ఆంటీ వచ్చేవరకే కదా!'' అంటూనే ''మధ్యాహ్నం ఎన్ని భోజనాలు?'' అని ప్రశ్నించింది.

''రెండు'' అన్న సుందరం సమాధానంతో వాడిక్కడే తిష్టవేస్తున్నాడని అర్థమయింది.

''వస్తా అంకుల్'' అంటూ తుర్రుమనగానే, ''ఎవర్రా ఈ నాచురల్ బ్యూటీ?'' అన్నాడు సుందరం.

''నీకెందుకులేగానీ.. ముందు కాఫీ తాగి స్నానం చేసిరా'' అన్నాను.

నెమ్మదిగా కాఫీ తాగుతూ ఎదురింటి గుమ్మంలో నిల్చున్న అరుణ వైపు చూశాను. 'పల్లెటూర్లలో కూడా పంజాబీ డ్రస్‌లతో దర్శనమిచ్చే పడుచులున్న ఈరోజుల్లో, తరచుగా లంగా ఓణీలతో తారసపడే అరుణ, పదహారణాల తెలుగు తరుణి' అన్పిస్తుంది. ముద్దుగా, బొద్దుగా, ముద్దబంతి పూవులా ఉంటుంది.

''సత్యం.. డ్రస్సింగ్ టేబిలెక్కడా?'' అన్న కేకతో ఈలోకంలోకొచ్చాను.

''ఆ.. అన్నట్లు ఇందాక వచ్చిన ఆ అమ్మాయి పేరేంటిరా! చాలాబాగుంది కదా!'' అన్నాడు.

''ఒరేయ్ సుందరం, నాకే కొద్ది సంవత్సరాల్లో నాలుగు పదులొస్తాయి. మరి నువ్వేమో నాకంటే సీనియర్‌వి..'' అన్నాను.

''నాల్గు పదుల్లో అలా అడక్కూడదా?'' అన్నాడు.

''మన వయసుకి తగ్గట్టుగా మాట్లాడితే బాగుంటుంది. సర్లేగాని నువ్వు డిగ్రీ డిస్‌కంటిన్యూ చేసింతర్వాత ఒక్కసారే అనుకుంటా కలిసావ్. అపుడంతగా సమయం లేకపోవడంతో నీతో మాట్లాడలేకపోయాను. ఆ తర్వాత నీ వివరాలేవీ తెలీలేదు'' అన్నాను.

''ఏముంది.. తరువాత ఎలాగోలా డిగ్రీ పూర్తిచేసి ఇంజనీరింగ్ సీటు కొన్నాను. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత జె.ఇ.గా పోస్టింగ్ రావడంతో, పెట్టిన పెట్టుబడిలో సగం కట్నం రూపేణా వచ్చేసింది'' అన్నాడు.

పన్నెండున్నర అవుతుండగా పెద్ద క్యారియర్‌తో అరుణ ప్రత్యక్షమైంది. ఆమె ఉన్న కొద్ది సమయంలో సుందరం తన చూపుల తూపులతో తినేసేటంత పనిచేసాడు.

''ఒరేయ్ సత్యం.. నువ్వు చాలా అదృష్టవంతుడివిరా! ఫ్యామిలీ లేకపోయినా అన్ని సౌకర్యాలూ అందుబాటులో ఉన్నాయ్'' అన్న మాటలు నా పళ్ళు బిగించేలా చేశాయి. వీడి ప్రవర్తన వయసుకి తగ్గట్టుగా లేదు. కాస్త వాడి ప్రవర్తనలో మార్పు తెప్పించే ఉద్దేశంతో, ''ఒరేయ్.. ఆ అమ్మాయి వయసెంతో తెలుసా? నువ్వు కాలేజీ విడిచిపెట్టి ఎన్ని సంవత్సరాలైందో, బహుశా అన్ని సంవత్సరాలే ఉండొచ్చు. కాబట్టి మన అభిరుచులు కూడా మనకనుగుణంగా ఉండాలి.''

''నీపేరుకు తగ్గట్టుగా బిహేవ్ చేస్తున్నావ్. అందాన్ని ఆస్వాదించడం కూడా తప్పేనా?'' అన్నాడు.

''నువ్వు ఆస్వాదిస్తున్నట్లుగా కనపడటంలేదు. ఆశించినట్లుగా ఉంది. ఒకవేళ అందాన్ని ఆస్వాదించినా, ప్రశంసించినా ఆమోదయోగ్యంగా ఉండాలి'' అని చీవాట్లు వేసాను.

కానీ వాడు వెళ్ళబోయేముందు కూడా ఆ ఇంటివైపే చూస్తూ వెళ్ళాడు. అదిచూసి 'వీడిలో మార్పు తీసుకురావాలి' అని నిర్ణయించుకున్నాను.

• • •

కొద్దిరోజుల తర్వాత సుందరం ఫ్యామిలీతోసహా రాజమండ్రి నుండి షిఫ్ట్ అయ్యాడు. మా ఫ్యామిలీ వచ్చిన తర్వాత వాడిని మా ఇంటికి సతీసమేతంగా రమ్మని ఆహ్వానించాను.

నెల తర్వాత ఓ ఆదివారం తీరిక చేసుకుని, భార్యతో కలిసి మా ఇంటికి సుందరం వచ్చాడు. వాడు వస్తూనే ఆరోజు కూడా ఎదురింటి వైపు చూడటం నేను గమనించకపోలేదు.

పరిచయ కార్యక్రమాలు అయినాక ఆడవాళ్ళు ఏవో కబుర్లు చెప్పుకుంటుండగా నేను, సుందరం బయట కూర్చున్నాం.

''సుందరం, మనం క్రికెట్ ఆడే రోజుల్లో గోపీ అని వుండే వాడు, గుర్తుందా?'' అన్నాను.

''నాకు గుర్తులేదు. కానీ ఇప్పుడేమయింది?''

''ఏంలేదు. వాడు నాకంటే బాగా జూనియర్. వాడిదో వెర్రి. వాడికింకా పెళ్ళికాలేదు. ఎవరో అమ్మాయి వాడివైపు చూస్తోందట. అప్పుడప్పుడు మా ఎదురింటికొస్తుందట. అందుకోసమని ఇక్కడికొస్తానన్నాడు. ఆ అమ్మాయి పేరు తెలీదు'' అని ఎదురింటి అరుణని పిలిచాను.

''అరుణా, గాంధీనగర్ కాలనీలో మీ ఫ్రెండ్ ఉంది కదా! ఆ అమ్మాయి పేరేంటి?'' అన్నాను.

''కొత్తగా రాజమండ్రి నుండి వచ్చి జాయినయిన అమ్మాయా? ఆ అమ్మాయి పేరు ప్రతిమ. ఎందుకంకుల్?''

''ఏంలేదులే నువ్వెళ్ళు'' అన్నాను.

ఆ పేరు వినడంతోనే సుందరం ముఖం అదోలా అయిపోయింది. నుదుట చెమటలు పట్టాయి.

''ఏమైందిరా సుందరం?'' అన్నాను.

''ప్రతిమ నా కూతురేరా!'' అంటూ డిప్రెషన్‌కి లోనైనట్లు బిగుసుకుపోయాడు.

అప్పటినుండి వాడి ప్రవర్తనలో మార్పు నాకు చాలా స్పష్టంగా కన్పించింది.

గోపీ అనేవాడు నేను సృష్టించిన వ్యక్తని సుందరంకి ఇప్పటికీ తెలీదు! నేనూ ఎప్పుడూ చెప్పలేదు!

★